

తుడా చైర్మన్‌ను అభినందించిన లోకేష్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కడప వేదికగా జరుగుతున్న మహానాడు సభలో వేదికపై ఆశీనులైన తుడా ఛైర్మన్, టిటిడి ఎక్స్అఫిషియో సభ్యులు డాక్టర్ దివాకర్‌రెడ్డిని మంత్రి నారా లోకేష్ అభినందించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ విధేయతతో సేవ చేసే సైనికులను తయారు చేయాలని దివాకర్‌రెడ్డికి సూచించారు.



ట్రాన్స్ 'ఫార్మర్' కష్టాలు

డీడీలు కట్టి ఏళ్లు గడుస్తున్నా...
కొత్తవి ఇవ్వరు..మరమ్మతు చేయరు..
చేయి తడిపితేనే పనులు ముందుకు..
విద్యుత్‌శాఖలో 'అక్రమాల' జోరు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఖరీఫ్ సీజన్ తరుముకొస్తోంది. వచ్చే నెల ప్రారంభం నుంచి రైతులు సాగుకు సమాయత్తమవుతారు. ఈ సమయంలో వారిని ట్రాన్స్‌ఫార్మర్ కష్టాలు వెంటాడుతున్నాయి. ఏళ్ల కొద్దీ వందల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నా ప్రభుత్వం పదుల సంఖ్యలో మాత్రమే మంజూరు చేస్తోంది. క్షేత్రస్థాయిలో వాటిని ఏర్పాటు చేసే క్రమంలో మెటీరియల్ పూర్తిస్థాయిలో ఇవ్వకపోతుండడంతో రైతులు మరికొంత ఆర్థిక కష్టాలు పడాల్సివస్తోంది. అధికారులు, కాంట్రాక్టర్ల చేతివాటం అదనపు భారమవుతోంది. దీంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఒక నెల దాటిన తర్వాత ప్రభుత్వం ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరు చేసినా పంటల సాగు ప్రారంభమై వాటిని పొలాల్లోకి తీసుకెళ్లడం కష్టమవుతుంది. సాధ్యమైన మేర ఖరీఫ్ ప్రారంభానికి ముందే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తేనే ఈ సంవత్సరమైనా బోర్లు, బావులు, కాలువల ద్వారా వ్యవసాయం చేయగలుగుతామని రైతులు అంటున్నారు. కొత్త వాటి పరిస్థితి ఇలా ఉంటే మరమ్మతుకు గురైన ట్రాన్స్‌ఫార్మర్ల పరిస్థితి ఇలానే ఉందని రైతులు వాపోతున్నారు. పాడైపోయి నెలలు గడుస్తున్నా మరమ్మత్తులు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డీడీలు కట్టినా మంజూరుకాని వైనం

వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం శ్రీకాళహస్తి విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో రైతులు డీడీలు తీసి రెండు, మూడేళ్లుగా ఎదురుచూస్తున్నారు. పెండింగ్ లో ఉన్న వాటి సంఖ్య వందల్లో ఉన్నా మంజూరవుతున్నవి కేవలం పదుల సంఖ్యలోనే ఉన్నాయి. అయితే తాము మాత్రం దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ నెల రోజుల కిందటే కొత్త ట్రాన్స్ ఫార్మర్లు అమర్చేసినట్లు ఎస్పీడీసీఎల్ అధికారులు చెబుతుండడం గమనార్హం.

చేయి తడిపితేనే పనులు ముందుకు

రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటే కేవలం డీడీలు తీస్తేనే సరిపోదు.



కిందిస్థాయి నుంచి పై స్థాయి వరకు అందరికీ చేతులు తడపాల్సిందే. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌కు డీడీలకు చెల్లించింది కాక మరో రూ.20వేల వరకు లంచాలు ఇస్తేనే పొలంలోకి చేరుతుంది. గ్రామస్థాయిలో ఉండే లైన్‌మన్ మొదలుకొని అందరికీ అదనపు చెల్లింపుల్లో వాటాలు సర్వసాధారణం. అన్నీ సజావుగా ఉండి ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైనా మెటీరియల్ పూర్తిస్థాయిలో రాలేదని కాంట్రాక్టర్‌లు కొర్రీలు వేస్తున్నారు. కొంత సామగ్రి ప్రైవేటుగా కొనుగోలు చేయాలని రైతులపై అదనపు భారాన్ని వేస్తున్నారు. అదనపు మెటీరియల్ పేరుతో ఎంతలేదన్నా మరో రూ.5వేల వరకు అధికంగా రైతులు ఖర్చు పెట్టాల్సివస్తోంది. తొట్టంబేడు మండలంలోని చేమూరులో నూతన ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటుకు కాంట్రాక్టర్ వేలల్లో డిమాండ్ చేసినట్లు బాధిత రైతు వాపోయాడు.

మరమ్మతుల్లో జాప్యం

శ్రీకాళహస్తి విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలో వ్యవసాయ బోర్లకు అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్లు ఇటీవల కురిసిన అకాల వర్షాలు, పిడుగులకు పెద్ద ఎత్తున కాలిపోయాయి. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి నిర్లక్ష్యం వల్ల బోర్ల కింద సాగులో ఉన్న పంటలు కోల్పోయే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పీఆర్ బుక్ చేసిన 48 గంటల్లో గా పాడైన ట్రాన్స్ ఫార్మర్లను బాగు చేయాల్సి ఉంది. అవసరమైతే వాటి స్థానంలో కొత్తవి అమర్చాలి. కాలిన ట్రాన్స్‌ఫార్మర్‌ల కోసం పీఆర్‌లు బుక్ చేసి నెల రోజులైనా అధికారులు స్పందించలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌ల కోసం విద్యుత్ సెక్షన్ ఆఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నామని రైతులు వాపోతున్నారు. మంగళవారం మన్నసముద్రం, కే బి బి పురం, కాట్రపల్లి, గొట్టిపూడి తదితర గ్రామాలకు చెందిన సుమారు పదిమంది రైతులు శ్రీకాళహస్తి ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద నిరీక్షించిన పరిస్థితి కనబడింది. కొన్నిచోట్ల మరమ్మత్తులు చేసి ఇచ్చిన ట్రాన్స్ ఫార్మర్లు నెల తిరగకముందే పాడైపోయాయని రైతులు వాపోయారు.

నెలన్నరకే పాడైంది: నాగరాజు, రైతు, మనసముద్రం

ఇటీవల కురిసిన అకాల వర్షానికి ట్రాన్స్ ఫార్మర్ దెబ్బతింది. తామే ట్రాన్స్ ఫార్మర్ ను కరెంట్ ఆఫీస్ కి తీసుకొస్తే మరమ్మత్తులు చేసి ఇచ్చారు. నెలన్నర రోజులకే ట్రాన్స్ ఫార్మర్ మళ్లీ మరమ్మతుకు గురైంది. ఇదేంటని ప్రశ్నిస్తే కుంటి సాకులు చెబుతున్నారు. మరమ్మత్తు పనులు నాసిరకంగా జరగడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

5 నిముషాలకే కాలిపోయింది: రమణా రెడ్డి, రైతు, రాంభట్లపల్లి

ట్రాన్స్ ఫార్మర్ మరమ్మతులకు గురైతే బాగు చేయించి ఇచ్చారు. ఆదివారం పెట్టిన ఐదు నిమిషాలకే కాలిపోయింది. మళ్లీ సొంత ఖర్చులతో పాడైన ట్రాన్స్ ఫార్మర్ ను కరెంటు ఆఫీస్ కి తీసుకొచ్చాం. ఇలా ప్రయాణ ఖర్చులు, ఫిట్టింగ్ ఖర్చులు తడిసి మోపెడయ్యాయి.

అన్నీ ఇచ్చేసాం : సుధాకర్, ఏడి, శ్రీకాళహస్తి

మా పరిధిలో ఉన్న అన్ని కొత్త వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను రైతులకు అందజేశాం. మరమ్మత్తులు కూడా పూర్తి చేశాం. మెటీరియల్ పనులు మాత్రమే కొంతమేర పెండింగ్ లో ఉన్నాయి.

అర్ధరాత్రి బుల్‌డోజర్లతో...



కరెంట్ కట్‌చేసి, ఫోన్లు పగలగొట్టి...
వేణుగోపాల్ కాలనీలో 80 ఇళ్లు కూల్చివేత
పథకం ప్రకారమే ఇళ్లను కూల్చారు : సిపిఎం
కోర్టు వివాద స్థలమని తెలియదు : బాధితులు
పేద, మధ్యతరగతి వారే సమిధలు

అర్ధరాత్రి.. కరెంట్ కట్ చేసేశారు.. సెల్‌ఫోన్లు ధ్వంసం చేశారు.. బుల్‌డోజర్లు తీసుకొచ్చి అక్రమంగా ఇళ్లల్లో చొరబడ్డారు.. ముసలీ ముతక అని చూడకుండా ఇళ్లల్లోనుంచి వాళ్లను బయటకు లాగేశారు.. ఇళ్లను కూల్చేశారు.. వస్తువులను ధ్వంసం చేశారు.. విలువైన వాటిని అపహరించారు.. తెల్లవారుజామున మొండిగోడల మధ్య బాధితులు కన్నీరుమున్నీరవుతూ కనిపించారు.. ఈ బుల్‌డోజర్ సంస్కృతి ఎక్కడో కాదు.. తిరుపతి శివారు ప్రాంతమైన మంగళం పరిధిలోని తిరుమలనగర్ పంచాయతీలో వేణుగోపాల్ కాలనీవాసులది.. దాదాపు 80 ఇళ్లు నేలమట్టమయ్యాయి. వీరంతా పేద మధ్యతరగతి ప్రజలే. తమ పేర్లతో పక్కాగా రిజిస్ట్రేషన్ అయి ఉందని, పంచాయతీకి పన్ను కడుతున్నామని, కరెంట్ మీటర్లు తమ పేరుతో ఉన్నాయని, బ్యాంకుల్లోనూ లోన్లు ఇచ్చారని బాధితులు వాపోతున్నారు. కూలినాలి చేసుకుని అంతోఇంతో మిగుల్చుకుని కొనుగోలు చేసుకుని ఇళ్లు కట్టుకుంటే అర్ధరాత్రి వచ్చి కూలదోస్తే తాము ఎలా బతకాలన్నది వారి ఆవేదన. 2016-2018 మధ్య ఈ కాలనీని వేసి, ప్లాట్ల క్రయవిక్రయాలను శ్రీనివాసులురెడ్డి, రుద్రగోపి చేశారని వారు గగ్గోలు పెడుతున్నారు.

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

చెన్నాయిగుంట గ్రామ లెక్క దాఖలా సర్వే నంబర్ 218/1లోని ఒక ఎకరా 64 సెంట్ల భూమి కోర్టు వివాదాల్లో ఉందని మంగళవారం ఇళ్ళ కూల్చివేత ఘటనతో వెలుగులోకి వచ్చింది. దీనిపై హైకోర్టు, ఆర్డీవో కోర్టు, జిల్లా కోర్టులలో కేసులు నడుస్తున్నాయని సదరు స్థలంలో ఫ్లాట్లను విక్రయించిన రుద్రగోపి మీడియాకు తెలిపారు. అయితే కోర్టుల్లో వేసిన కేసులను వెనక్కు తీసుకోవాలని నిర్మల, రాజన్ బాబు, మునిరెడ్డి అనే కొంతమంది గత మూడు నెలలుగా తనపై ఒత్తిళ్లు తీసుకు వస్తున్నారని, ఈ క్రమంలోనే సదరు స్థలంలో నిర్మించిన ఇళ్లను కూల్చివేసినట్లుగా తెలిపారు. చెన్నాయిగుంట గ్రామ లెక్క దాఖలా సర్వేనెంబర్ 218/1లోని సర్వే నంబర్ తో పాటుగా ఇతర సర్వే నంబర్లను విక్రయ డాక్యుమెంట్లో పేర్కొంటూ రిజిస్ట్రేషన్లు జరిపినట్లుగా తెలుస్తోంది.

గతంలో ప్రస్తుతం ఇల్లు కూల్చివేసిన స్థలాన్ని అమ్మిన వ్యక్తులు ఒకరికి జిపిఎ చేయకుండా ఇద్దరు వ్యక్తులకు జిపీఏలు చేసినట్లుగా సమాచారం. చిన్నమ్మ, మునికష్ణారెడ్డి, గోపాల్ రెడ్డి, మునిరామిరెడ్డి, రఘునాథ రెడ్డి వద్దనుండి కొనుగోలు చేసిన వ్యక్తుల్లో ఒకరు వారి కుమార్తె అయిన నిర్మలకు గిఫ్ట్ డీడ్ కింద స్థలాన్ని రాసి ఇచ్చినట్లుగా సమాచారం. ఇదే భూమిపై రుద్రగోపి, శ్రీనివాసరెడ్డిలు కూడా జిపిఎ పొందినట్లుగా తెలుస్తోంది. వీరిదగ్గర స్థలాలను కొనుగోలు చేసిన వారిలో 15 మంది పోలీసులూ ఉన్నట్లు సమాచారం.



స్పందించని పంచాయతీ కార్యదర్శి

కోర్టు వివాదంలో ఉన్న స్థలానికి సాధారణంగా పన్నులు మంజూరు చేయరు. అయితే మంగళవారం వేణుగోపాల కాలనీలో కూల్చివేయబడ్డ ఇళ్లలో తిరుమల నగర్ గ్రామపంచాయతీ నుండి 15 ఇళ్లకు సంబంధించి పన్నులు జారీ చేసినట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం పంచాయతీ ఇంచార్జ్ కార్యదర్శి మురళిని వివరణ కోరగా ఆయన స్పందించలేదు. ఫోన్ అందుబాటులో లేదు.



కూల్చిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిపిఎం రాష్ట్ర నేత వై.వెంకటేశ్వరరావు

కూల్చిన వారిని కఠినంగా శిక్షించాలి : సిపిఎం

బాధితులు పంచాయతీ నుంచి ఇంటిపన్ను, రెవెన్యూ ఇచ్చిన ఎన్ఒసి, కరెంట్ డిపార్టుమెంట్ ఇచ్చిన మీటర్, బ్యాంకుల నుంచి లోన్లు తీసుకున్నారని, అన్ని రకాలుగా వీరు చట్టబద్ధంగా కొనుగోలు చేసి, ఇళ్లు కట్టుకుని, కాపురాలు ఉన్న వారిపై దౌర్జన్యంగా బుల్‌డోజర్లు తెచ్చి, భయానక వాతావరణంలో ఇళ్లను కూల్చివేయడం దారుణమని సిపిఎం రాష్ట్ర నేత వై.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఖండించారు. ఇదే అదనుగా విలువైన వస్తువులను అపహరించుకుపోయారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, దౌర్జన్యానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పేదలు సమిథలయ్యారని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం బాధితులను పరామర్శించి సిపిఎం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

నేను జాయిన్ అవ్వకముందు ఇచ్చి ఉండొచ్చు :
మోహన్, ఎఇ, విద్యుత్ శాఖ, మంగళం

తిరుమల నగర్ గ్రామపంచాయతీ వేణుగోపాల కాలనీలో తాను డ్యూటీలో చేరకముందు ఇచ్చి ఉండొచ్చు. ప్రస్తుతం రిజిస్టర్డ్ భూమి కాకుండా డీకేటి భూములలో ఎవరైనా ఇల్లు నిర్మించుకొని విద్యుత్ కనెక్షన్లు కావాలని కోరితే సంబంధిత పంచాయతీ కార్యదర్శి ఆ స్థలంకు సంబంధించి ఎన్ఓసి ఇవ్వాల్సి ఉంటుంది. అలా ఉంటేనే విద్యుత్ కనెక్షన్లు ఇస్తాం.

యోగా జీవితంలో భాగం కావాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'యోగాను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగం చేసుకోవాలి' అని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా తిరుపతి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ర్యాలీలో కలెక్టర్, ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ ఎన్.మౌర్య, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు నరసింహ ఆచారి జెండా ఊపి ప్రారంభించారు. కృష్ణాపురం ఠాణా నుంచి నాలుగుకాళ్ల మండపం వరకు ర్యాలీ సాగింది. అనంతరం మానవహారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖపట్నంలో నిర్వహిస్తున్నారని, ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోడీ హాజరవుతారని అన్నారు. ఈనెల 21న మహిళా వర్సిటీలో యోగా దినోత్సవాన్ని ప్రారంభించామని, 29 నుంచి జూన్ 19 వరకూ తిరుమల, శ్రీహరికోట, చంద్రగిరి, శ్రీకాళహస్తి, ఎస్వీ జూపార్కులో దాదాపు వెయ్యి మందితో యోగా ప్రాముఖ్యతను తెలుపుతూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. జూన్ 10న తిరుమలలో ఐదువేల మందితో చేస్తామన్నారు. ప్రతి మండలానికి నలుగురు మాస్టర్ ట్రైనర్లు 200 మందికి శిక్షణ ఇచ్చి దాదాపు పది లక్షల మందికి యోగా ప్రయోజనాలు, ప్రాముఖ్యత తెలిసేలా చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, మేనేజర్ హసీమ్ పాల్గొన్నారు.



అంతర్ రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



గంజాయిని తరలిస్తున్న అంతర్ రాష్ట్ర ముఠా సభ్యులను సోమవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 13 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్లో డీఎస్పీ నరసింహమూర్తి మంగళవారం మీడియా ముఖంగా వివరించారు. ఒరిస్సా రాష్ట్రం నుండి తమిళనాడు రాష్ట్రంలోని అంబత్తూరు ప్రాంతానికి గంజాయి తరలిస్తున్నట్లు టూ టౌన్ సీఐ నాగార్జున రెడ్డికి రహస్య సమాచారం అందింది. కేటి రోడ్డు లోని ఎంజిఎం ఆసుపత్రి సర్కిల్ వద్ద చెన్నై వెళ్లేందుకు బస్సు కోసం ఎదురుచూస్తున్న ముగ్గురు అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా గంజాయి గుట్టు బయటపడింది. పట్టుపడ్డ వారిలో ఎం. మురళి (22), జె. శ్యామ్ రాజ్ (21), ఎం.సంజయ్ కుమార్ (22)లు ఉన్నారు. వీరంతా తమిళనాడుకు చెందిన వారుగా గుర్తించారు. తమిళనాడులో పలు నేరాల్లో వీరు నిందితులుగా ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. పారిపోయిన మరో ఇద్దరు ముఠా సభ్యులకు కోసం ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నట్లు వివరించారు. సీఐ నాగార్జున రెడ్డిని, ఎస్ఐ పార్థసారథి తదితర సిబ్బందిని అభినందించారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

ఎర్రమరెడ్డి పాలెం చెరువు ఆక్రమణను అడ్డుకుంటాం

ప్రజాశక్తి -రేణిగుంట



తిరుపతి జిల్లా రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీకి చెందిన ఎర్రమరెడ్డి పాలెం చెరువు ఆక్రమణదారులపై కేసులు పెట్టాలని, లేదంటే గ్రామస్తులు ద్వారా ఫెన్సింగ్‌ను తొలగిస్తామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెనుమూరు హేమలత జిల్లా ఇరిగేషన్ అధికారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా మంగళవారం ఎర్రమరెడ్డిపాలెం గ్రామ చెరువు సర్వే నెంబర్ 141 లో సుమారు 55 ఎకరాలు ఉండగా అందులో 10 ఎకరాల 50 సెంట్లు చెరువు మునగడ స్థలం ఆక్రమణకు గురైందని తెలిపారు. కొంతమంది ప్రభు, వెంకటయ్య, సుబ్రహ్మణ్యం కలిసి ప్రైవేట్ కళ్యాణ్ మండపం పేరుతో చెరువు మునగడ స్థలంలో ట్రాక్టర్లతో మట్టితోలి ఫెన్సింగ్ వేసినా, ఆక్రమణదారుల నుండి చెరువును కాపాడాలని గ్రామ రైతులు వెళ్లి 'గ్రీవెన్స్ డే' లో జిల్లా కలెక్టర్ కు, ఇరిగేషన్ అధికారులకు అర్జీలు పెట్టిన విషయం గుర్తు చేశారు. ఇంతవరకు అధికారుల నుండి ఎటువంటి స్పందన లేదని, ఆక్రమణదారులు వేసిన ఫెన్సింగ్‌ను రైతు సంఘం ఆధ్వర్యంలో తొలగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎర్రమ రెడ్డిపాలెం గ్రామ రైతులు, సిపిఎం పార్టీ రేణిగుంట ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్ వెళ్లి చెరువు ఆక్రమణను పరిశీలించారు.

అయినను పోయి రావలె కడపకు..

మహానాడులో..ఒక్కటైన 'అసమ్మతి' తమ్ముళ్లు..!

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

కడప జిల్లాలోని పబ్బవరంలో టిడిపి మహానాడు అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఒక రోజు ముందుగానే పబ్బవరం వెళ్లారు. మంగళవారం మిగిలిన నాయకులు వెళ్లారు. మంగళవారం పబ్బవరం వెళ్ళిన వారిలో ముఖ్యులుగా మాజీ ఎమ్మెల్యేలు ముని రామయ్య, ఎస్సీవి నాయుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు దశరథ ఆచారి, చలపతి నాయుడు, విజయకుమార్ నాయుడు, కంటా రమేష్, బాలాజీ, గోపి తదితరులున్నారు. అయితే ఎమ్మెల్యే సుధీర్ రెడ్డితో విభేదించిన మాజీ ఎమ్మెల్యేలు ముని రామయ్య, ఎస్సీవి నాయుడు ఒక వర్గంగా ఉంటున్నారు. వీరితో దశరథాచారి, చలపతి నాయుడు, బాలాజీ కలవడంపై అనుమానాలు వస్తున్నాయి. శ్రీకాళహస్తి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్ష పదవి కోసం దశరథాచారి, చలపతి నాయుడు పోటీ పడుతున్నారు. అయితే తనకు అనుకూలంగా ఉంటున్న చెంచయ్య నాయుడుకు అధ్యక్ష పదవి ఇప్పించడానికి ఎమ్మెల్యే తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారుని టాక్ నడుస్తోంది. అంతేగాకుండా శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ పదవి కూడా ఎవరికి ఇవ్వలేదు. టిడిపి పట్టణ అధ్యక్షుడి పదవి ఆశించి పేట బాలాజీ రెడ్డి భంగపడ్డారు. ఈ క్రమంలో మంగళవారం నుంచి ప్రారంభమైన మహానాడు సభలకు వెళ్లిన నాయకులు అసమ్మతి వర్గం వారితో కలవడం టీడీపీ వర్గాల్లో కలవరం రేపింది. ఎమ్మెల్యేతో తీవ్రంగా విభేదించిన మాజీ ఎమ్మెల్యేలు పార్టీ కార్యాలయానికి రావడం లేదు. అయితే కార్యక్రమాలను మాత్రం నిర్వహిస్తున్నారు. మహానాడు సందర్భంగా పబ్బవరంలో యాదచ్ఛికంగా కలిశారా ..? లేదా అసమ్మతితో కలిశారా..? అనేది 'టాక్ ఆఫ్ ది శ్రీకాళహస్తి'.



శ్రీకాళహస్తి నుంచి విచ్చేసిన దగ్గళం


నిరంతర వైద్య 'శ్రామికుడు'

ప్రజాశక్తి-తిరుపతి సిటి

బర్డ్ డైరెక్టర్‌గా ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టరు గుడారు జగదీష్ బుధవారం బాధ్యతలు చేపట్టనున్నారు. గతంలో బర్డు హాస్పిటల్ డైరెక్టర్‌గా విశేష అనుభవం గడించిన ఆయన ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా పలు హాస్పిటల్స్‌లో సంక్లిష్టమైన ఆర్థో ఆపరేషన్లను లక్షల్లో విజయవంతంగా నిర్వహించిన 'హస్తవాసి'.చలనం లేని కాళ్లకు చైతన్యం తెప్పించారు.. వంగిన వెన్నులకు దన్ను అందించారు.. విరిగిన చేతులను తిరిగి అతికించారు.. ఆయనే వైద్యశ్రామికుడు డాక్టర్ గుడారు జగదీష్. వైద్యవృత్తిలో నాలుగు దశాబ్దాల అనుభవం ఆయనది.

దక్షిణాసియాలోనే అతి పెద్ద ఎముకల ఆస్పత్రి బాలాజీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సర్జరీ, రీసెర్చి అండ్ రీహేబిలిటేషన్ (బర్డ్). 37 ఏళ్లపాటు వైద్యునిగా, బోధకునిగా, డైరెక్టర్‌గా ఆ వైద్యాలయంలో ఆయన సేవలను అందించారు. బర్డ్ అంటే జగదీష్, జగదీష్ అంటే బర్డ్ అనే ముద్ర కూడా ఆయన చేసిన అభివృద్ధిలో భాగంగా పేరుగడించింది. ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వ్యాఘ్రేశ్వరుడి శిష్యుడిగా కెరీర్‌ని ఆరంభించిన జగదీష్ వందలమంది యువ వైద్యులకు మార్గనిర్దేశం చేశారు. అంగవైకల్యంతో పుట్టినవారికీ, దివ్యాంగులకూ, ప్రమాదాలబారిన పడ్డవారికీ తన శస్త్రచికిత్సలతో పునర్జన్మనిచ్చారు. ఫ్లోరైడ్ బాధితుల కాళ్ల వంకర్లు సరిచేయడం, మోకాళ్ల, వెన్నెముక శస్త్రచికిత్సలూ ఇలా ఇప్పటివరకూ 1.28 లక్షల శస్త్రచికిత్సలు నిర్వహించారు. దేశవ్యాప్తంగానూ అనేక వైద్య శిబిరాల్లో పాల్గొని పోలియోకి ఉచిత స్క్రీనింగ్, శస్త్రచికిత్సలు చేశారు. 2019లో బర్డ్ డైరెక్టర్‌గా పదవీ విరమణ చేసిన డాక్టర్ జగదీష్ తన సేవలను విస్తృతం చేస్తూ రోగుల దగ్గరకే వైద్యాన్ని అందించారు. శారీరక శ్రమ ఎక్కువగా ఉండే మత్స్యకారుల్లో ఎముకల సమస్యలు అధికంగా ఉండటాన్ని గుర్తించి వారుండే ప్రాంతాలకు వెళుతున్నారు. మత్స్యకారులు ఎక్కువగా ఉండే ప్రకాశం జిల్లాలోని కరేడు గ్రామాన్ని ఏడాదిన్నర కిందట దత్తత తీసుకున్నారు. గ్రామంలో ఆర్థోపెడిక్ సమస్యలతో బాధపడేవారందరికీ చికిత్స చేసి నయంచేయడమే లక్ష్యంగా లింగారెడ్డి అన్నపూర్ణమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్యసేవల్ని ఉచితంగా అందిస్తున్నారు. రోజుకు దాదాపు 60-70 మందికి వైద్యసేవలతోపాటు మందులనూ, వారికి అవసరమయ్యే పరికరాలనూ ఉచితంగా అందజేస్తుంటారు. ఫ్లోరైడ్ సమస్య అధికంగా ఉండే ప్రకాశంతోపాటు చిత్తూరు, నెల్లూరు, గుంటూరు, కష్ణా, ఉభయ గోదావరి జిల్లాలకు ప్రతినెలా వెళ్తుంటారు. ఈయన దత్తత గ్రామాల్లో తిరుపతి జిల్లా వెంకటగిరి కూడా ఉంది. అక్కడ జీఎన్ఆర్ ట్రస్టుద్వారా ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. ఒంగోలులోని రమేష్ సంఘమిత్ర హాస్పిటల్స్, గుంటూరు వడ్లమూడిలోని డీవీసీ ట్రస్టు హాస్పిటల్‌తోపాటు తాను సహ వ్యవస్థాపకుడిగా ఉన్న ద్వారకా తిరుమలలోని విర్డ్ ట్రస్టు హాస్పిటల్... ఇలా పలుచోట్లకు తరచూ వెళ్తూ శస్త్రచికిత్సలు చేస్తున్నారు. రాయలసీమతో ఈయనది సుదీర్ఘ అనుబంధం. దాన్ని కొనసాగించాలని తిరుపతిలోని రాష్ట్రీయ సేవా సమితి కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తుంటారు. ఇక్కడికి కర్ణాటక, తమిళనాడుల నుంచి కూడా రోగులు వస్తుంటారు.

> **"జీవితం అనేది ఒకటే ఉంటుంది. ఈ చిన్న జీవితంలో ఎంత ఎక్కువ మంది ఆర్థులకు సేవ చేసామన్నదే ముఖ్యం. తండ్రి కోరికమేరకు వైద్య వత్తిలోకి వచ్చాను. తుదిశ్వాస వరకు వీలైనంత ఎక్కువ మంది రోగులకు సేవ చేసి వారి ముఖాల్లో చిరునవ్వులు చూడటం ద్వారా జీవన సాఫల్యత పొందాలన్నదే నా లక్ష్యం."**
> **-డాక్టరు గుడారు జగదీష్, బర్డ్ డైరెక్టర్, తిరుపతి.**





బర్డ్ డైరెక్టర్‌గా డాక్టరు జగదీష్ నేడు బాధ్యతలు స్వీకరణ

కుటుంబమంతా వైద్యసేవలోనే..

కడప జిల్లా పుల్లంపేట మండలంలోని టి.కమ్మపల్లికి చెందిన వ్యవసాయ కుటుంబంలో జన్మించారు జగదీష్. తల్లిదండ్రులు లీలావతమ్మ, లక్ష్మయ్యనాయుడు. డాక్టర్ కావాలన్న తన లక్ష్యం నెరవేరకపోవడంతో పిల్లల చదువుల కోసం కుటుంబాన్ని తిరుపతికి మార్చారు లక్ష్మయ్య. తండ్రి కోరికనే తన లక్ష్యంగా మార్చుకున్న జగదీష్ ఇంటర్మీడియెట్ వరకూ తిరుపతిలో చదివారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్, మణిపాల్ మెడికల్ కాలేజీ నుంచి ఆర్థోపెడిక్స్‌లో ఎం.ఎస్. పూర్తిచేశారు. ఆయన సతీమణి నిర్మలాదేవి గైనకాలజిస్టు. వీరికి కవల పిల్లలు కల్యాణ్, కార్తిక్. కల్యాణ్ లండన్‌లో యూరాలజిస్టుగా స్థిరపడ్డారు. కార్తిక్ ఆర్థోపెడిక్ సర్జన్. హైదరాబాద్‌లో 'మా ఆర్థోపెడిక్ హాస్పిటల్'ను నిర్వహిస్తున్నారు. జగదీష్ ఇక్కడా తన సేవల్ని అందిస్తారు. డాక్టర్ జగదీష్ సేవలు మరింతకాలం బర్డ్ హాస్పిటల్ ద్వారా అందించడం కోసం బుధవారం తిరిగి బాధ్యతలను స్వీకరించనున్నారు. 1981లో వైద్యునిగా తన వృత్తిని ప్రారంభించిన జగదీష్ అంగవైకల్యం ఎవరికీ శాపం కాదని నిరూపిస్తూ, సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తూ నిత్యశ్రామికునిగా పేరు గడించారు.



నేడు నిషాన్



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరులోని హజరత్ సయ్యద్ హషీం హుస్సేని బోబియా గంధ మహోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం సాయంత్రం ఏడు గంటలకు దర్గా ఆవరణలో నిషాన్ జెండా కార్యక్రమం నిర్వహించ నున్నారు. జూన్ రెండో తేదీ గంధ మహోత్సవం నిర్వహించ నున్నారు. నిషాన్, గంధమహోత్సవాలలో భక్తుల సౌకర్యార్థం దర్గా ఆవరణలో అన్నదానం ఉంటుందని దర్గా వెల్ఫేర్ కమిటీ ప్రతినిధులు తెలిపారు. భక్తులు బుధవారం నిర్వహించే నిషాన్‌లో పాల్గొనాలని దర్గా ముస్లిం వెల్ఫేర్ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్ కోరారు.

డిగ్రీ కళాశాలలో నూతన కోర్సు ప్రారంభం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రమౌళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సును మంగళవారం ప్రారంభిం చారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి చంద్రమౌళి మాట్లాడుతూ ఉచితంగా కళాశాలలోని స్కిల్ హబ్‌లో వివిధ రకాల స్కిల్ కోర్సులను అందిస్తున్నామని తెలిపారు. ఉచిత కోర్సులు లభిస్తున్నాయని విద్యార్థులు వీటిని ఆశ్రయించి మంచి స్కిల్స్ పొందాలని కోరారు. ఈ కోర్సు 30 మందితో ఒక్క బ్యాచ్ ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమంలో డిడిఏ ఆఫ్ హెచ్ ఓ డి డాక్టర్ బి నరసింహులు, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఎస్ రఘురాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని శ్రీ కళ్యాణ వీరభద్ర స్వామి ఆలయంలో ప్రతి మంగళవారం నిర్వహించే అన్నదానంలో భాగంగా నిర్వాహకులు మునిమోహన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఉభయ దాతలుగా పాకం నాగేశ్వర రావు, శేషమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు హనుమంతరావు, అనిల్ కుమార్ వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

రోవర్, రేంజర్ లీడర్ యూనిట్లకు రెన్యువల్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన రోవర్ స్కౌట్ లీడర్లు, రేంజర్ లీడర్లు తమ యూనిట్లను రెన్యువల్ చేసుకోవాలని జిల్లా రోవర్ కార్యాలయ కమిషనర్ టి రమేష్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని రోవర్ స్కౌట్ లీడర్, రేంజర్ లీడరుగా శిక్షణ పొంది, రెన్యువల్ చేసుకోకపోయినా, ప్రస్తుతం వారి సర్టిఫికెట్లు, యూనిట్ సభ్యుల వివరాలతో రాష్ట్ర కార్యనిర్వాహక కమిషనర్ ఎన్ కోటేశ్వర రావు వాట్సాప్ నంబరు 9666223796, 9494750614 (టి రమేష్ బాబు)కు పంపాలని కోరారు. అలా రెన్యువల్ చేసుకున్న రోవర్లు, రేంజర్లు మాత్రమే ప్రముఖ ఆలయాలలో సేవలకు అవకాశం కల్పిస్తారని తెలిపారు.

నెహ్రూ అందరివాడు: కాంగ్రెస్



నెహ్రూకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ అందరి వాడని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బాల గురవం బాబు, శ్రీకాళహస్తి నియోజక వర్గ సమన్వయకర్త తలారి దామోదర్ రెడ్డి అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నెహ్రూ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పంచవర్ష ప్రణాళికను ఆవిష్కరించి దేశం, ప్రజలు సుభిక్షంగా ఉండేలా నెహ్రూ కృషి చేశారని వక్తలు కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో నేటి తరం నడవాలని పిలుపునిచ్చారు.

డీలర్ శేషారెడ్డికి పరామర్శ



డీలర్‌ను పరామర్శిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట అగ్రహార పేట కు చెందిన రేషన్ డీలర్ శేషారెడ్డిని మంగళ వారం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య స్థానిక వైసీపీ నాయకులతో కలిసి పరామర్శించారు. నాయుడుపేటలో ఎన్నో ఏళ్లుగా రేషన్ షాపు నడుపుతూ సుపరిచితుడైన డీలర్ శేషారెడ్డి గత కొంత కాలంగా అనారోగ్యంతో హాస్పిటల్లో చికిత్స చేయించుకొని అగ్రహార పేటలో తన నివాసం లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య స్థానిక వైసీపీ నాయకులతో కలిసి శేషారెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. శేషారెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైసీపీ అధ్యక్షులు కలికి మాధవ రెడ్డి, నాయుడుపేట మండల వైసీపీ అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్, నాయుడుపేట మున్సిపల్ కౌన్సిలర్ దారా రవితేజ, పాలేటి నాగార్జున, వైసీపీ నాయకులు గండవర్ల సిద్దయ్య, మెస్ భాస్కర్ రెడ్డి, పలువురు నాయకులు శేషారెడ్డిని పరామర్శించిన వారిలో ఉన్నారు.

నేడు పిజిఆర్ఎస్ విద్యుత్ పరిష్కార వేదిక: ఎస్ఈ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: అర్జీదారులు సంతృప్తి పడేలా వారి సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ పరిష్కారాల వేదిక బుధవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తున్నట్లు ఏపీ ఎస్‌పిడిసిఎల్ తిరుపతి ఎస్ఈ సురేంద్ర నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం తిరుపతి సర్కిల్ తో పాటు, తిరుపతి రూరల్, తిరుపతి టౌన్, పుత్తూరు, నాయుడుపేట, గూడూరులో నిర్వహిస్తామని తెలిపారు. వినియోగదారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మహానాడు మహాద్భుతం: బొజ్జల



మహానాడులో పాల్గొన్న బొజ్జల సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కడపలో టిడిపి మహానాడు మహాద్భుతంగా ప్రారంభ మైందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. మహానాడు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బొజ్జల శ్రీకాళహస్తి ప్రాంత టిడిపి నేతలతో కలిసి పాల్గొన్నారు. ఎమ్మెల్యే హోదాలో మహానాడుకు హాజరు కావడం అదృష్టంగా భావిస్తున్నాని తెలిపారు.

భక్తుల భద్రతకు అదనపు సిబ్బంది కేటాయింపు



ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలోని అలిపిరి మెట్టమార్గం, ఘాట్ రోడ్డుల వద్ద ఇటీవల కాలంలో వన్యమృగాలు, ముఖ్యంగా చిరుతపులుల కదలికలు పెరిగిన నేపథ్యంలో మానవ–వన్యప్రాణి ఘర్షణల నివారణ చర్యలపై మంగళవారం గోకులం సమావేశ మందిరంలో ఉన్నతాధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. టీటీడీ ఈవో జె. శ్యామల రావు (వర్చువల్), అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి సమావేశం నిర్వహించారు. అలిపిరి మెట్టమార్గంలో భక్తుల భద్రతకు అదనపు సిబ్బందిని కేటాయించనున్నారు. ఎప్పటికప్పుడు ఆరోగ్యశాఖ ద్వారా చెత్తను తొలగించేందుకు చర్యలు చేపట్టనున్నారు. టీటీడీ అటవీ, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆరోగ్య, విజిలెన్స్ శాఖలతో కలిసి అటవీ శాఖ సమన్వయంతో నడకమార్గంపై నిరంతర జాయింట్ డ్రైవ్ నిర్వహించనున్నారు. వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ అవశ్యకతను గుర్తించారు. ఈ సమావేశంలో వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సీనియర్ సైంటిస్ట్ డా. రమేష్ కృష్ణమూర్తి, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెల్వం, డి.ఎఫ్.ఓ వివేక్ ఆనంద్ పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులను అందించడానికే ఎన్‌సీసీ

శిక్షణ కమాండెంట్ రాజగోపాల్ జగదీష్ ఆత్రే



మాట్లాడుతున్న శిక్షణ కమాండెంట్ రాజగోపాల్ జగదీష్ ఆత్రే

ప్రజాశక్తి -రామచంద్రపురం: విద్యార్థులు చిన్నతనం నుండే దేశభక్తి, సమాజ సేవను పెంపొందించుకోవాలని, దేశ రక్షణకు ఉత్తమ పౌరులను అందించడానికే ఎన్‌సీసీ శిక్షణ నిర్వహిస్తున్నామని క్యాంపు కమాండెంట్ కెప్టెన్ రాజగోపాల్ జగదీష్ ఆత్రే అన్నారు. మంగళవారం సి రామాపురం లోని వెరిటాస్ సైనిక పాఠశాల ఆవరణలో 11 ఎయిర్ స్క్వాడ్రన్ (టెక్నికల్) ఎన్‌సిసి తిరుపతి గ్రూప్ ప్రధాన కార్యాలయం ఆధ్వర్యంలో కంబైన్డ్ వార్షిక శిక్షణ శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచి ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవడానికి ఎన్‌సీసీ శిక్షణ ఎంతోఉపయోగపడుతుందన్నారు. విద్యార్థిని విద్యార్థులు ఈ కంబైన్డ్ వార్షిక ఎన్‌సీసీ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవా లన్నారు. సమాజ సేవలో ప్రతి ఒక్కరూ ఐకమత్యంగా, క్రమశిక్షణగా భాగస్వాములై అందరికీ ఆదర్శవంతంగా నిలవాలన్నారు. ఈ కంబైన్డ్ వార్షిక శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎయిర్ వింగ్ విభాగంలో ఎనిమిది మంది , ఆర్మీ వింగ్‌లో ఎనిమిది మంది విద్యార్థులను గుర్తించి జాతీయ స్థాయి శిక్షణకు ఎంపిక చేస్తామని క్యాంప్ కమాండెంట్ కెప్టెన్ రాజగోపాల్ జగదీష్ ఆత్రే పేర్కొన్నారు. ఈ శిక్షణలో క్యాడెట్లకు యోగా శిక్షణ, విపత్తులు, ప్రమాదాల నివారణపై డ్రిల్, పారిశుధ్యం, ఆరోగ్యంపై వర్క్‌షాప్‌లు, ఆయుధాల నిర్వహణ, ఎయిర్ వింగ్, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కార్ టేకింగ్ ఆఫీసర్ రాజశేఖర్, క్యాంప్ పర్యవేక్షకులు గుణశేఖర్ లు తెలిపారు. శారీరక దృఢత్వం పెంపునకు హెల్త్ రన్, వ్యాయామాలు చేపట్టినట్లు వారు తెలిపారు. ఎయిర్ ఫోర్స్ శిక్షణ అధికారి లక్ష్మీ నరసింహ విద్యార్థులకు విమానాలు నడపడంపై శిక్షణ ఇచ్చారు. స్విమ్స్ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత తోనే సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని, ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ క్యాంపు కమాండెంట్ కల్నల్ శ్రీనివాసులు, క్యాంప్ పర్యవేక్షకులు గుణశేఖర్ ఏఎన్ఓలు, ఆఫీస్ సిబ్బంది, ఎన్‌సిసి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి



తనిఖీ చేస్తున్న జిల్లా పౌరసరఫరాల అధికారి శేషాచల రాజు

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): చౌక దుకాణ డీలర్లు ప్రజలకు నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని తిరుపతి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శేషాచల రాజు అన్నారు. చంద్రగిరి మండలంలోని రేషన్ దుకాణాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎండియు వ్యవస్థ రద్దు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం మళ్లీ డీలర్ల వ్యవస్థను ప్రవేశ పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో నిర్వహిస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థ రేషన్ దుకాణాలను తనిఖీ చేపట్టినట్లు వివరించారు. ఇందులో భాగంగా మంగళవారం చంద్రగిరి మండలంలోని రేషన్ దుకాణాలను తనిఖీ చేశామని తెలిపారు. మండలంలోని రేషన్ దుకాణాలలో హెచ్చుతగ్గులను, ప్రజా పంపిణీ వ్యవస్థ పరికరాలను పరిశీలించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దారు గంగయ్య, మండల స్థాయి అధికారులు, రేషన్ డీలర్స్ అసోసియేషన్ ప్రసిడెంట్ చక్రవర్తి రెడ్డి, లోకేశ్వరి, శ్రీనావతి, గిరి, పలువురు డీలర్లు పాల్గొన్నారు.

నేడు ఎస్వీయులో ఎన్టీఆర్ జయంతి

ప్రజాశక్తి - క్యాంపస్ : మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతిని ప్రతి సంవత్సరం మే 28వ తేదీన రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం సెనేట్ హాలులో బుధవారం సమావేశం నిర్వహించనున్నామని రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

డిగ్రీ రెండవ సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వర్సిటీ అధికారులు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల అటానమస్ హోదాలో డిగ్రీ మొదటి సంవత్సరం, రెండవ సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్ 28 వ తేదీ నుండి మే 7వ తేదీ వరకు నిర్వహించారు. వీటి ఫలితాలు ఎస్వీ ఆర్ట్స్ కాలేజ్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ పివి చలపతి పర్యవేక్షణలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్ వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ప్రకటించారు. పరీక్షలు నిర్వహించిన 20 రోజులలోనే ఫలితాలను ప్రకటించడం విశేషం అన్నారు. ఈ పరీక్షల ఫలితాలలో విద్యార్థులు 88.05 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫలితాల కోసం హెచ్‌టిటిపిఎస్// ఎస్‌విఎసి.ఇడియు.ఇన్/ డెమో వెబ్‌సైట్‌లో చూడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జునరావు, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కామేశ్వరరావు, రమేష్, ఎగ్జామినేషన్ సెల్ కి చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

మహానాడుకు యువసేన



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కడప మహానాడుకు పుత్తూరు రూరల్ మండలం, మున్సిపాల్టీ నుంచి టీడీపీ నాయకులు తరలివెళ్లారు. నగరి నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎ రఫీ అహ్మద్, మండల మాజీ అధ్యక్షుడు డి రవికుమార్, మత పెద్దలు, టిడిపి నాయకులు గెట్ పుత్తూరు మసీదు మస్జిద్, ఏ ముఖద్దస్ ముతవల్లి మహమ్మద్ గౌస్, నగరి నియోజకవర్గ మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు ఎద్దుల హుస్సేన్, నగరి నియోజకవర్గ అధికార ప్రతినిధి చాను, తదితరులు తరలి వెళ్లారు. వీరితో పాటూ చిత్తూరు పార్లమెంట్ మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్కే.షబ్దర్ , హమీద్ బాష, నగరి నియోజకవర్గం టిడిపి తెలుగు యువత ఆర్గనైజ్ సెక్రెటరీ యూనిస్ వెళ్లారు.

తిరుపతిలో త్వరలోనే క్రీడా మైదానాలు ఏర్పాటు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుపతికి అతి త్వరలో ఏసీఏ ఆధ్వర్యంలో క్రీడా మైదానాలు తీసుకొస్తామని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కోశాధికారి దండమూడి శ్రీనివాస్ తెలిపారు. చిత్తూరు ప్రీమియర్ లీగ్(సిపిఎల్–1)లో భాగంగా మంగళవారం ఐదవ రోజు మధ్యాహ్నం జరిగిన మ్యాచ్ కు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి క్రీడాకారులను పరిచయం చేసుకొని మ్యాచ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో ప్రతి ఒక్క జిల్లాలో టర్ఫ్ పిచ్చులు తీసుకురావాలనే సంకల్పంతో ఏసిఏ ముందుకు వెళుతున్నదన్నారు. అందులో భాగంగా తిరుపతి జిల్లాలో కూడా స్థలాలను పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు. క్రికెట్ క్రీడాకారులకు సరైన ఇన్ఫ్రాస్ట్రక్చర్ కల్పించి జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో ఆడే విధంగా ప్రోత్సహించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. అనంతరం ఏసిఏ రాష్ట్ర ఇన్ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్, చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు విజయకుమార్(క్రికెట్ విజయ)మాట్లాడుతూ తిరుపతిలో క్రీడా మైదానాలు కావాలని ఇప్పటికే పలుమార్లు ఏసీఏ అధ్యక్ష, కార్యదర్శులతో మాట్లాడడం జరిగిందన్నారు. అందుకు సానుకూలంగా స్పందించిన వాళ్లు అతి త్వరలో తిరుపతిలో టర్ఫ్ పిచ్ లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిసిఏ కార్యదర్శి రవి, కోశాధికారి గిరి ప్రకాష్, ఉపాధ్యక్షులు శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

శివుని సేవలో మ్యూజిక్ మాస్టర్ కీరవాణి



కీరవాణిని సత్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఎంఎం కీరవాణి మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ముక్కంటి దర్శనార్థం విచ్చేసిన కీరవాణికి స్థానిక ఎంజీఎం గ్రాండ్ హోటల్ అతిథ్యమిచ్చింది. ఎంజీఎం సంస్థల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ కీరవాణికి సాదర స్వాగతం పలికి బస ఏర్పాట్లు చేశారు. ఎంజీఎం ఆతిథ్యం బాగుందని కీరవాణి మయూర్‌కు అభినందనలు తెలిపారు.

రక్తదానం చేసి మరొకరి ప్రాణం రక్షించండి

ప్రజాశక్తి - క్యాంపస్ : రక్తదానం చేసి మరొక వ్యక్తి ప్రాణాలు నిలబెట్టాలని ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ అంజు వాద్వా పిలుపునిచ్చారు. ఎన్‌సిసి నగర్‌లో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో రక్తదాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఎస్వీ రుయా హాస్పిటల్ డాక్టర్ హరిత ఆధ్వర్యంలో ఐదు ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ కర్నల్ అంజు వాద్వా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 20 మంది ఎన్‌సిసి క్యాడెట్లు, పది మంది ఆర్మీ స్టాఫ్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సమాజ అవగాహనలో భాగంగా ఎన్‌సిసి క్యాడేట్లకు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుబేదార్ మేజర్ శర్మ, చీఫ్ ఆఫీసర్ భారతి, హవల్దార్ వెంకటేశ్, రుయా హాస్పిటల్ సిబ్బంది, ఎన్‌సిసి క్యాడేట్లు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా సీఎం

- శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: కార్యకర్తల సంక్షేమం కోసం పని చేసే ఏకైక పార్టీ టిడిపి అని, అధికారమైనా, ప్రతిపక్షంలో వున్నా సీఎం చంద్రబాబు నాయుడు కార్యకర్తలకు ఎళ్లవేళలా అండగా నిలిచారని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. కడప మహానాడు సభలో కార్యకర్తల సంక్షేమ తీర్మానాన్ని శాప్ ఛైర్మన్ ప్రవేశపెట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ అనేక మహానాడులలో వాలంటీరుగా పనిచేశానని, నేడు మహానాడు వేదికపై నిలబడేందుకు అవకాశం ఇచ్చిన సిఎంకు, లోకేష్ కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

నైతిక విలువలు పాటించాలి

ఏపీ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ దగ్గుమాటి శ్రీహరిరావు

ప్రజాశక్తి - క్యాంపస్ : వైద్య రంగంలో నైతిక విలువలు పాటించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ తిరుపతికి చెందిన ప్రముఖ రేడియాలజిస్టు డాక్టర్ దగ్గుమాటి శ్రీహరి రావు పేర్కొన్నారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనను ఏబిఆర్ఎస్ఎం రాష్ట్ర శాఖ తరపున రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వై వి రామిరెడ్డి, కోశాధికారి ప్రొఫెసర్ ఎం రాజశేఖర్ ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఎం రమేష్, మహిళా ప్రతినిధి డాక్టర్ ఎం పద్మావతి తిరుపతిలో కలిసి అభినందనలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీహరి రావు మాట్లాడుతూ వైద్యరంగం ఎంతో పవిత్రమైందని అనేక రకాల అనారోగ్యాలతో రోగులు, వైద్యుడు మీద నమ్మకంతో చికిత్స కోసం వస్తారని ఆ నమ్మకాన్ని కాపాడుతూ సరైన వైద్యాన్ని రోగులకు అందించాల్సిన బాధ్యత ప్రతి డాక్టర్ పైన ఉందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో వైద్య విద్యలో వృత్తిలోకి ప్రవేశించే కొత్త డాక్టర్లకు వైద్య వృత్తిలో పాటించాల్సిన నైతిక విలువలు ,మానవీయ దృక్పథం, దయ, పరస్పర గౌరవం మొదలైన విషయాల పైన సరియైన అవగాహన కల్పించిన తరువాత మాత్రమే వారికి రిజిస్ట్రేషన్ ను ఇస్తుందని వివరించారు. ఈ దిశగా యువ వైద్యులందరికీ కూడా మెడికల్ కౌన్సిల్ అవగాహన కల్పిస్తుందని తెలిపారు.

ఆర్టీసీ బస్‌స్టేషన్లలో శుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: జిల్లాలోని అన్ని ఆర్టీసీ బస్ స్టేషన్లలో శుభ్రత పాటించాలని, ఆర్టీసీ బస్సులన్నింటిని సమయ పాలనా ప్రకారం నడపాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులను కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్ నుండి వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, తిరుపతి జిల్లా లోని అన్ని బస్సు డిపో మేనేజర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని బస్ స్టేషన్లలో శుభ్రత పాటించాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, టాయిలెట్స్ నిర్వహణ, నీటి సౌకర్యం బాగుండాలని ఆదేశించారు. ప్రయాణికులు ప్రయాణించే బస్సులు అన్ని కండిషన్ లో ఉండేటట్లు చూసుకుంటూ, ఏదైనా మరమ్మత్తులు వచ్చిన వెంటనే మరమ్మత్తులు చేయాలని, లేని పక్షంలో వేరే బస్సులను వేయాలని తెలిపారు. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవలసిన బాధ్యత సంబంధిత డిపో మేనేజర్లదే అని ఆదేశించారు. ప్రయాణికుల సౌకర్యార్థం, సూచిక బోర్డులను, బస్సు టైమింగ్ వివరాలను, హెల్ప్ డెస్క్ ను ప్రతి బస్టాండులో ఏర్పాటు చేయాలని సూచించారు. బస్ స్టేషన్లలోని షాపులలో వస్తువులను ఎమ్మార్పీ ధరలకే అమ్మాలని, ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరలకు అమ్మ రాదని ఆదేశించారు. ఆలా అమ్మిన దుకాణాలపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏదో ఒక సమయంలో అనుకోకుండా బస్ స్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో తిరుపతి జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి కనితి వెంకట్రావు, తిరుపతి బస్ స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ డి రామచంద్ర నాయుడు, తిరుమల డిపో మేనేజర్ విశ్వనాథం, తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ పాల్గొన్నారు.

అత్యవసర ప్రతిస్పందన నైపుణ్యాలు విలువైనవి: ఆర్‌టివో



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అత్యవసర సమయాలలో సమీపంలోని వ్యక్తుల ప్రతిస్పందన నైపుణ్యాలు బాధ్యత ప్రాణాలు కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ అన్నారు. ప్రపంచ అత్యవసర వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అమర హాస్పిటల్ బృందం ఆధ్వర్యంలో సిపిఆర్, ప్రాథమిక ప్రథమ చికిత్స శిక్షణపై తిరుపతి కరకంబాడి మార్గంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో మంగళవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివరామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ వల్ల సాధారణ ప్రజలు, ప్రొఫెషనల్ డ్రైవర్లు, విద్యార్థులలో ప్రాణాలను రక్షించే అత్యవసర ప్రతిస్పందన నైపుణ్యాలను అందిపుచ్చుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. ఒక అత్యవసర ప్రక్రియ గుండె, ఊపిరితిత్తుల పనితీరు ఆగిపోయినప్పుడు ఆక్సిజన్ అందించడం ద్వారా ప్రాణాలు కాపాడడానికి ఉపయోగ పడుతుందన్నారు. గుండె ఆగిపోయినప్పుడు లేదా ఊపిరి ఆగిపోయినప్పుడు చేయబడే ప్రక్రియ ద్వారా పునరుజ్జీవనం పొందడానికి వీలవుతుం దన్నారు. సిపిఆర్ ద్వారా ఆగిపోయిన గుండెపై ఒత్తిడి చేసి మళ్లీ గుండె పని చేయడానికి దోహదపడుతుందన్నారు. డ్రైవర్లతో ముఖాముఖి వారి సందేహాలు నివృత్తి చేశారు. పలువురు డ్రైవర్లతో సిపిఆర్ కార్యక్రమం చేయించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ ఎంవిఐలు వెంకట సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, అతికా నాజ్, పరిపాలన అధికారులు శ్రీనివాసరావు, విజయ ప్రశాంతి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సినీ ఫక్కీలో మహిళ మెడలో బంగారు గొలుసును అపహరించిన ఘటన ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బంగారమ్మ కాలనీ చెందిన సురేఖ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో వాకింగ్ చేసేందుకు రోజూ వెళుతోంది. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనంలో వచ్చి మెరుపు వేగంతో మహిళ మెడలో బంగారు గొలుసును లాక్కుని పరారయ్యాడు. ఈ ఘటనతో నిర్ఘాంతపోయిన మహిళ చేసేది లేక టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోగొట్టుకున్న బంగారు గొలుసు బరువు 33 గ్రాములు ఉంటుందని బాధిత మహిళ తెలిపింది.

చెట్టును ఢీకొన్న కారు

పలువురికి గాయాలు , ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి -ఏర్పేడు : కారు చెట్టును ఢీకొన్న ప్రమాదంలో పలువురుకి గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా వుంది. ఈ సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ఓజిలికి చెందిన ఓ కుటుంబం శ్రీవారి దర్శనానంతరం తిరిగి తమ ఊరికి వెళుతుండగా ఏర్పేడు మండలం రాజుల పాలెం వద్ద మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో వేగంగా వస్తున్న కారు రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్ కి తరలించారని గ్రామస్తులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి

ప్రజాశక్తి -ఏర్పేడు : రోడ్డు ప్రమాదంలో ఓ కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానిక పుష్పిత్ స్టీల్ ఫ్యాక్టరీలో ఉత్తర ప్రదేశ్‌కు చెందిన రిషికేషే(33) కూలీగా పనిచేస్తున్నాడు. తన స్నేహితులతో పాటు పుష్పిత్ స్టీల్ ఫ్యాక్టరీ ఎదురుగా సోమవారో రాత్రి రోడ్డు దాటుతుండగా ఓ గుర్తు తెలియని వాహనం రిషికేష్‌ను అతివేగంగా వచ్చి ఢీకొంది. దీంతో కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఏర్పేడు ఎస్ఐ ఎన్ శ్రీకాంత్ రెడ్డి ప్రమాద తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లేపాక్షి నంది నోట్ పుస్తకాలు విడుదల

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: లేపాక్షి నంది నోట్ పుస్తకాలను కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ మంగళవారం మార్కెట్లోకి విడుదల చేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 2025వ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వినూత్న పద్ధతిలో ఖచ్చితమైన పేజీల తో సరసమైన ధరలతో గవర్న మెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఏపిటీపిసి లిమిటెడ్ వారు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు ను ఆకాంక్షిస్తు లేపాక్షి నంది నోట్ బుక్స్ ను అందిస్తున్నారన్నారు. నేటి విద్యార్థులకు అవసరమైన అత్యధిక, నాణ్యమైన ఖచ్చితమైన పేజీలతో, విద్యార్థుల అందమైన అక్షరాలకు నాణ్యమైన పుస్తకాలుగా, లేపాక్షి నంది నోట్ బుక్స్ ను అందిస్తుందన్నారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఆర్థిక భారాన్ని తగ్గించడానికి ఈ పుస్తకాలను తక్కువ దరలతో అందిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా లోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వే తర పాఠశాలలు, గవర్నమెంట్, ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం, విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పుస్తక విక్రేత సంస్థలకు, షాపులకు 40 శాతం డిస్కౌంట్ అందిస్తారని తెలిపారు. ఈ సదవకాశాన్ని అన్ని పాఠశాలలు విద్యాసంస్థలు పుస్తక విక్రేత సంస్థలు సద్వినియోగం చేసుకోవలని కోరారు. వివరాలకు 91-9505199855, 91-9963484962 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా డిస్ట్రిబ్యూటర్ కె జ్ఞాన శేఖర్ రెడ్డి, తిరుపతి డిపో ఇన్చార్జ్ ధన శేఖర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

గ్రంథాలు బహూకరణ



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర వేదవిశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి తమ వ్యక్తిగత సేకరణ నుండి అమూల్యమైన 300 పుస్తకాలను వేదవిశ్వవిద్యాలయ గ్రంథాలయానికి బహుమతిగా అందించారు. వీటిలో అమూల్యమైన ఆధ్యాత్మిక గ్రంథాలు, వైదిక గ్రంథాలు, ఆగమ గ్రంథాలు, స్వతంత్ర రచనలు, అనువాదాలు, వ్యాఖ్యానాలు, నిఘంటువులు వున్నాయి. ఈ గ్రంథాలు వేదవిశ్వవిద్యాలయ గ్రంథాలను మరింత పరిపుష్టం చేస్తాయని పేర్కొన్నారు. ఈ గ్రంథాలను విశ్వవిద్యాలయ రిజిస్ట్రారు ఆచార్య పి భాస్కరుడుకి అందించారు. ఈ కార్యక్రమములో విశ్వవిద్యాలయ, పరిశోధన విభాగ నిర్దేశకులు డాక్టరు ఎ వేంకటరాధేశ్యామ్ పాల్గొన్నారు.

గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 2 నుండి 10వ తేదీ వరకు నిర్వహించనున్న నేపథ్యంలో పోస్టర్‌ను టిటిడి ఈవో జె శ్యామలరావు మంగళవారం ఆవిష్కరించారు. టిటిడి పరిపాలనా భవనంలోని ఈవో ఛాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో శ్రీగోవిందరాజ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు సౌకర్యవంతంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆలయంలో చలువ పందిళ్లు, వైట్ పెయింట్, ఆకట్టుకునేలా రంగోలీలు, విద్యుత్ అలంకరణలు, పెయింటింగ్స్, పుష్పలంకరణలు తదితర ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్ట్, దాస సాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి జేఈవో వి వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో విఆర్‌శాంతి, జీవో మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: యోగా ద్వారా మానసిక ఒత్తిడి దూరం చేసుకోచ్చని యోగా శిక్షకులు సురేష్ నాయుడు తెలిపారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో యోగాంధ్ర మంగళవారం ప్రారంభమైంది. మండలంలోని సచివాలయం ఒకటి, రెండు, మూడు, నాలుగు సచివాలయాల క్లస్టర్లకు సంబంధించి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీ సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో యోగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యోగ శిక్షకులు సురేష్ నాయుడు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో త్రివిక్రమరావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిఈటి మస్తానయ్య , నాలుగు క్లస్టర్ల సచివాలయ సిబ్బంది, ఎంపీడీవో పాల్గొన్నారు.

దొరవారిసత్రం : మండలంలోని మీజూరు , పూలతోట, కల్లూరు ఈ మూడు సచివాలయాలలో యోగాను ప్రారంభించారు. కల్లూరు సచివాలయం ప్రధాన కేంద్రంగా మోడల్ ఆఫీసర్‌గా ఎంపీడీవో గోవర్ధన్‌ను, నోడల్ ఆఫీసర్‌గా ఏపీవో ఉషారాణి నియమించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఉషారాణి, పూలతోట మిజూరు కల్లూరు సచివాలయాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

మాజీ మంత్రి కాకాణి అరెస్ట్ దారుణం

-జిల్లా వైసీపీ ఉపాధ్యక్షులు రాధాకృష్ణారెడ్డి



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా వైసిపి అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి అరెస్టు పూర్తిగా అక్రమమని, రాజ్యాంగ వ్యతిరేకమని ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ ఉపాధ్యక్షులు మెట్టా రాధాకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల హామీలు అమలుచేయకుండా ప్రజలను మోసం చేస్తూ కూటమి ప్రభుత్వం చర్యలను ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులపై ఒక ప్రణాళిక ప్రకారం కక్ష సాధింపు చర్యలకు పాల్ప డుతున్నారని ఆరోపించారు. ఇందులో భాగం గానే నిరాధార ఆరోపణలతో కాకాణి గోవర్ధన్ రెడ్డిపై అక్రమ కేసులు నమోదు చేశారని రాధాకృష్ణ రెడ్డి, గూడూరు మండల పరిషత్ అధ్యక్షులు బూదురు గురవయ్య, రాష్ట్ర వైసీపీ యువజన విభాగం కార్యదర్శి కొండూరు సునీల్ కుమార్ రెడ్డిలు విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ లో అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి, తమ రాజకీయ ప్రయోజనాల కోసం రాసుకున్న 'రెడ్ బుక్' రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని విమర్శించారు. ప్రజల హక్కులను హరిస్తూ కూటమి ప్రభుత్వం సాగిస్తున్న దుర్మార్గ పాలనకు ప్రజలు చరమ గీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని పేర్కొన్నారు. కూటమి అక్రమాలపై ప్రశ్నించే వైసిపి నాయ కులు, కార్య కర్తల గొంతు నొక్కేందుకు అధికార దుర్వి ని యోగం ద్వారా ప్రభుత్వం అక్రమ కేసు లను నమోదు చేస్తోందని ఇది పూర్తిగా అప్రజాస్వామిక మన్నారు. తమకు, తమ పార్టీకి న్యాయ వ్యవస్థపై గౌరవం ఉందని, న్యాయ స్థానాలలోనే ఈ కుట్రలపై న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు.

ప్రణాళికా బద్ధంగా పెండింగ్ నిర్మాణ పనులు : జేసీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టు పనులు సంబంధించి పలు భూసంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా, వేగవంతంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టు పనులు సంబంధించిన పలు భూసంబంధిత పెండింగ్ అంశాలు, నిర్మాణ పురోగతి పనులపై వర్చువల్ విధానంలో నేషనల్ హైవే పీడీలు, సూళ్లూరుపేట, శ్రీకాళహిస్త ఆర్డీవోలు కిరణ్మయి, భానుప్రకాష్‌రెడ్డి, మండలాల తహశీల్దార్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రేణిగుంట, పూడి, గూడూరు, రేణిగుంట, పాకాల, తిరుపతి టౌన్ సంబంధించిన రైల్వే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే ప్రాజెక్టు పనులకు సంబంధించి భూసేకరణ పనులు పూర్తయ్యాయన్నారు. నేషనల్ హైవేలు తిరుపతి - తిరుత్తణి, సి.మల్లవరం- రేణిగుంట, నాయుడుపేట - తిరుపతి, పీలేరు - కాలూరు, రేణిగుంట - కడప లైన్ల పెండింగ్‌పనులు త్వరితగతిన పూర్తవ్వాలన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జిలు తిరుపతి, ఏర్పేడు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సాగరమాల పనులు నేషనల్ హైవే అధికారులతో సమన్వయం చేసుకుని పూర్తి చేయాలన్నారు. తిరుపతి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఈ మధుసూదన్ రావు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ ఈ సురేంద్ర నాయుడు, నేషనల్ హైవే పిడిలు చెన్నై, నెల్లూరు, తిరుపతి రవీంద్రరావు, వెంకటేశ్వర్లు, వెంకట చలపతి పాల్గొన్నారు.

సిసిపిఎల్-1లో ఫైనల్‌కు పాయ్ వైస్రాయ్

- నేడు సెమీస్‌లో తలపడనున్న ఆదిత్య వర్సెస్ హైపీరియన్ జట్లు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: గత ఐదు రోజులుగా ఎస్వీయూ తారకరామా స్టేడియంలో హోరాహోరీగా సాగుతున్న సిపిఎల్ -1 లో పాయ్ వైస్రాయ్ జట్టు ఫైనల్ కు చేరుకోగా, నేడు ఆదిత్య వారియర్స్ వర్సెస్ హైపీరియన్ జట్లు సెమీఫైనల్ లో తలపడనున్నాయి. సెమీఫైనల్ లో గెలుపొందిన జట్టు గురువారం మధ్యాహ్నం జరిగే ఫైనల్ మ్యాచ్ లో పాయ్ వైస్రాయ్ జట్టుతో తలపడనుంది.

హైపీరియన్ జట్టుపై వైస్రాయ్ జట్టు విజయం

సీపీఎల్ వన్‌లో భాగంగా మంగళవారం ఉదయం నిర్వహించిన మ్యాచ్‌లో పై వైస్రాయ్ జట్టు హై పీరియడ్ జట్టుపై ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. కెప్టెన్ సూర్య మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు కైవసం చేసుకున్నారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును ఎస్ఎల్‌వి బిల్డర్స్ శివశంకర్, పాయ్ వైస్రాయ్ మేనేజర్ మదనమోహన్, సిడిసిఏ ఉపాధ్యక్షులు శ్రీధర్, మాజీ రంజీ ప్లేయర్ రాకేష్ అందించారు.



నగదు కానుక అందుకుంటున్న మ్యాన్‌ఆఫ్‌ద మాచ్

స్పార్టన్ వారియర్స్ ఘన విజయం

మధ్యాహ్నం మ్యాచ్‌లో ఆదిత్య లెవన్స్ వర్సెస్ స్పార్టన్ వారియర్స్ తలపడ్డాయి. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆదిత్య జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 186/7 పరుగులు చేసింది. స్పార్టన్ జట్టు 19 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 158 పరుగులు చేసి విజయం సాధించింది. సల్మాన్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకున్నారు. సీడీసీఏ ఉపాధ్యక్షులు శ్రీనివాసులు మూర్తి, మురళి,జాయింట్ సెక్రెటరీ సతీష్ యాదవ్,హెడ్ కోచ్ సునీల్ కుమార్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందించారు.

నేడు ఉమెన్స్ ఎక్స్‌పోజర్ మ్యాచ్

సిపిఎల్ -1లో భాగంగా ఉమెన్స్ క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సిడిసిఏ అధ్యక్షులు విజయ్ కుమార్(క్రికెట్ విజయ్) ఆదేశాల మేరకు బుధవారం ఉమెన్స్ ఎక్స్‌పోజర్ మ్యాచ్ నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈ మ్యాచ్‌లో డిస్టిక్, జోన్, స్టేట్ ఆడిన ఉమెన్స్ క్రికెట్ క్రీడాకారులు ఆడనున్నారు. ఈ మ్యాచ్‌ను కూడా ప్రత్యేక ప్రసారం అందించినట్లు క్రికెట్ విజయ్ తెలిపారు.

ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలి

ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ సిహెచ్ ద్వారక తిరుమలరావు

ప్రజాశక్తి- కుప్పంరూరల్: ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని రాష్ట్ర ఎపిఎస్ ఆర్‌టీసీ ఎండి ద్వారక తిరుమలరావు సూచించారు. మంగళవారం కుప్పం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ ఆధ్వర్యంలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆర్టిసి ఎండితో పాటు కడా పీడీ వికాస్ మరమ్మత్, ఈడీలు చెంగల్ రెడ్డి, అప్పలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కడా పీడి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో కుప్పం డిపోలో త్వరితగతిన విద్యుత్ బస్సులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం కార్యచరణ సిద్ధమైందని, త్వరలో కుప్పం ప్రజలకు విద్యుత్ బస్సుల అందుబాటులో రానున్నట్లు తెలిపారు. ఆర్టీసీ ఎండి మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని, వారికి మెరుగైన రవాణా సదుపాయం కల్పించాలని, ప్రయాణికులకు సేవలు అందించడమే ఆర్టీసీ ప్రథమ లక్షమన్నారు. రాష్ట్రంలోనే ఆర్టీసీను మోడ్రన్ డిపోగా మార్చడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, అధునాతన సౌకర్యాలతో కూడిన డిపో నిర్మాణానికి త్వరలో పనులు ప్రారంభం కానున్నట్టు తెలిపారు. అలాగే సంస్థ ఉద్యోగులకు బకాయిలు చెల్లించడానికి సైతం ఆదేశాలు జారీ చేయనున్నట్టు తెలిపారు.

పలమనేరు: ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ సిహెచ్ ద్వారకా తిరుమలరావు పలమనేరు డిపోను పరిశీలించి ఆవరణలో మొక్కలు నాటారు. మంగళవారం డిపో పరిధిలో పనిచేస ఉద్యోగులకు సన్మాన కార్యాక్రమంలో భాగాం ఆదర్శ ఉద్యోగులను ప్రశంసా పత్రాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో పనిచేసే డ్రైవర్లు, కండక్టర్లు అందరూ ప్రభుత్వ ఉద్యోగులేనని, వారికి అందాల్సిన బెనిఫిట్లను అన్నింటిని సకాలంలో అందేవిధంగా తన వంతు కృషి చేస్తానని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ద్వారకా తిరుమలరావు



చర్చిస్తున్న తిరుపతి అడిషనల్ ప్రాజెక్టుకో ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి

ఆటిజం సెంటర్ ఏర్పాటు పరిశీలన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల లో ఆటిజం సెంటర్ ఏర్పాటుకు తిరుపతి అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ చంద్ర శేఖర్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. అనంతరం క్షేత్ర స్థాయిలో బాలికల పాఠశాల ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మాధవి లక్ష్మి , జెఆర్‌పిలు హేమలత , అజయ్ బాబు , మంగమ్మ , శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఘటనా స్థల వద్ద పరిశీలిస్తున్న పోలీసులు

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- పలమనేరు: చిత్తూరు జిల్లా పలమనేరు రూరల్ మండలం మాదిగ బండ గ్రామానికి చెందిన చంద్రమోహన్ (40) మంగళవారం పొలంలో ఉన్న ఆయన తండ్రి సమాధి వద్ద ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. వ్యక్తి ఆత్మహత్యకు కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.



కాలువ పూడికతీత పనులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వర్షాకాలం నేపథ్యంలో నగరపాలక పరిధిలో కాలువల్లో ముందస్తుగా పూడికతీత పనులు చేపట్టాలని మేయర్ ఎస్.అముద సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మేయర్ కట్టమంచిలో జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. వర్షాకాలం నేపథ్యంలో నగరంలోని పెద్ద, మధ్యస్థ, చిన్న కాలువలన్నింటిలో పూర్తిస్థాయిలో పూడిక తొలగించాలన్నారు. వర్షాకాలంలో ఎక్కడా కాలువలు బ్లాక్ కాకుండా ముందస్తుగా తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో అన్ని వార్డుల్లో జరుగుతున్న పూడికతీత పనుల వివరాలను ఎంహెచ్వో డాక్టర్ లోకేష్ వివరించారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా ముందస్తుగా అన్ని వార్డుల్లోనూ పనులు చేయిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులకు తగిన ఆదేశాలు ఇచ్చామన్నారు.